# విసుగు - విరామం

-యస్వీ చారి

ఆస్ట్రేలియా ఖండం! మెల్బోర్న్ మహానగరం!

సాయంకాలం ఆరు కావస్తోంది. ఆకాశం నలుపు రంగుని పులుముకుని ఉంది. ఉదయం నుంచీ వర్షం కురుస్తూనే వుంది. సౌమ్యకి ఆఫీసులో రోజంతా చిరాకుగా గడిచింది. క్షణం తీరిక లేకుండా మీటింగులు జరుగడంతో విసుగు పుట్టుకొచ్చింది. ఈ పై వాళ్లకి ప్రతి విషయంలోనూ ఎందుకిన్ని సందేహాలు కలుగుతాయో ఎవరికీ అర్థం కాదు. అసలు ఊహకు కూడా అందని ఆలోచనలతో క్రిందివాళ్లపై తమ ప్రభావాన్ని చూపిస్తూ ఉండడం ఓ సహజ విషయంగా మారిపోతోంది. ఆ విసుగుకు తోడుగా ఇంటికి వెళ్లాలంటే అసహ్యం పుడుతోంది. కానీ తప్పదుకదా అనుకుంటూ మెట్రో స్టేషన్‌లో అడుగు పెట్టింది.

ఫ్లిండర్స్ స్టేషన్ అంతా రద్దీగా ఉంది. ఆఫీసుల నుంచి తిరిగి వెళ్లే జనం రోజురోజుకూ అధికం అవుతున్నారు. ఈమధ్య కాలంలో బస్సులు, ట్రాముల కోసం ఎదురు చూడడంకంటే ఈ మెట్రో ప్రయాణమే సౌకర్యంగా ఉంది. పైగా అన్నీ ఎయిర్ కండిషన్ కోచ్‌లే కావడంతో జనానికి ఎంతో ఉపశమనం లభిస్తోంది.

కంపార్ట్‌మెంట్‌లో అంతా తెల్లవాళ్ల గోల అధికంగా ఉంది. రైల్లో కూడా ఆ తెల్లమొహాలే దాపురించాయని అసహ్యించుకుంటూ వేడి చిప్స్, పళ్లరసం గ్లాసులతో సీట్లోకి జారిపోయింది సౌమ్య.

చల్లని పానీయం గొంతులోకి జారగానే ప్రాణానికి మళ్లీ జీవం పోసినట్లయింది. దాంతో చిప్స్ తినాలనిపించలేదు.

ఇంతలో ఓ ఇద్దరు కుర్రాళ్లు వచ్చి పత్రికల్ని పంచి వెళ్లారు. ఆస్ట్రేలియాలో దినపత్రికలు చాలావరకు అలా ఉచితంగా దొరుకుతుంటాయి.

పత్రికని తిరగేస్తూ ఒక్కసారిగా ఉలిక్కిపడింది సౌమ్య.

ఓ పేజీలోని పెద్దావిడ ఫోటో చూడగానే ఆమెకి వెర్రి పుట్టుకొచ్చినట్లయింది. ఆ ఫోటోలోని భారతీయ వనిత సౌమ్య అత్తగారే కావడంతో ఆమెకు చెంప ఛెళ్లుమన్నట్లయింది. ఈ దేశంలో ప్రతి చిన్న విషయానికి కొండంత ప్రచారం లభిస్తుంది.

వీధి వీధికో పత్రిక ఉండడంతో వార్తలు కరువయి రోడ్లమీద కనిపించిందంతా పేజీల్లో నింపేస్తారు.

తమ ఇంటి దగ్గర బేబీ కేర్ సెంటర్‌లో జరిగిన ఓ చిన్న సమావేశం వార్తని పెద్ద ఎత్తున వెలుగులోకి తీసుకొచ్చిందా పత్రిక. ఆ వేడుకలో మనవరాలిని ఎత్తుకుని నుంచున్న అత్తగారి ఫోటోకు చోటు లభించడాన్ని భరించలేకపోయింది సౌమ్య.

భర్త పోయాక సమీర్ తల్లి జానకమ్మగారికి మరో తోడు లేకుండా పోయింది. వారికి సమీర్ ఒక్కడే సంతానం.

ఆ కారణంగా తల్లి బాధ్యతల్ని మరెవరికీ అప్పగించలేకపోయాడు సమీర్. ఆ విషయం పెళ్లికి ముందే సౌమ్యకి తెలుసు. కానీ పెళ్లి తరువాత ఆ అనుబంధం ఆమెకు ఎంతో ఇబ్బందికరంగా మారింది.

ఆస్ట్రేలియాలో చదువు పూర్తి చేసుకున్నాక సమీర్‌కి వెంటనే ఉద్యోగం రావడం ఎంతో సంతోషాన్ని కలిగించింది కానీ తమ వెంటే అత్తగారు కూడా మెల్బోర్న్‌కి వచ్చేయడాన్ని మాత్రం సౌమ్య భరించలేకపోతోంది. ఆ విషయాన్ని సమీర్ గ్రహించలేకపోతున్నాడు.

జీవితాన్ని సరదాగా సంతోషంగా గడపాల్సిన తరుణంలో అత్తగారిని అతి కష్టంగా భరిస్తూ వస్తోంది సౌమ్య.


అందుకు జతగా రెండు కళ్లల్లో ఓ కంటికి దోషాన్ని కలిగివున్న అత్తగారి రూపం గురించి స్నేహితుల ఇల్లాళ్లు, ఇంటి పరిసరాల్లోని ఇంగ్లీషు కుటుంబాలు గత నాలుగేళ్లుగా నవ్వుకుంటూ ఉండడం ఆమెకి అవమానకరంగా మారింది. ఆ మనోవ్యథ ఈమధ్య మరీ ఎక్కువవుతోంది.

సమీర్ తల్లి జానకమ్మగారికి ఒక కన్ను మెల్ల. అయినా రెండు కళ్లు బాగానే కన్పిస్తాయి. నడివయస్సులోనే భర్తని కోల్పోయిన ఆమె అన్ని అలంకారాల్ని వదిలేయడంతో మెల్లకన్నుగల ఆమె ముఖ కవళికలు ఓ అనకారిరూపాన్ని సంతరించుకున్నాయి.

అలాంటి తన రూపాన్ని రోజూ చుట్టుపక్కల ఆడవాళ్లంతా చులకనగా చూడడం, కుర్రాళ్లంతా ఆట పట్టిస్తూ ఉండడం లాంటి ఇబ్బందుల్ని పెద్ద మనసుతో అతి చిన్న విషయాలుగా పరిగణిస్తోందామె.

అలాగే కొడుకు కోడళ్ల మనస్తత్వాలని కూడా ఎంతో ఉదారగుణంతో మన్నిస్తూ అటు ఇంటి పనులతోను ఇటు మనవరాలి ఆలనాపాలనాతోనూ కాలాన్ని గడిపేస్తోంది.

కోడల్ని ఒక కూతురుగా భావిస్తోందామె. మంచి మనస్సు. రోజంతా ఆఫీసు పనితో అలసిపోయి ఇంటికివచ్చిన సౌమ్యని ఏ పనీ చేయని



వ్వరావిడ. ప్రతి పండుగకూ కొడుకు వెంటపడుతూ కోడలికి, మనవరాలికి కొత్త బట్టలు కొనిపించడం ఆమెకు ఓ ఆచారంగా మారిపోయింది. ఒక విధంగా తనకు కూతురులేని లోటుని అలా సరిపుచ్చుకుంటూ వస్తోందామె. అయితే ఆ అనురాగం కానీ అభిమానం గానీ సౌమ్యలో ఏ కొంచెం మార్పుని కూడా తీసుకురాలేదు. అసలు ఆవిడ ప్రేమనీ, తన మీద పొంగి పొర్లుతున్న అభిమానాన్ని, తన గురించి ఆవిడ తీసుకుంటున్న శ్రద్ధనీ, పడుతున్న శ్రమని గుర్తించాలన్న ఆలోచనే ఆమెకేనాడూ కలగలేదు.

మెల్బోర్న్ నగరంలో అటువంటి బాధ్యతారహిత వాతావరణంలో ఎన్నో తెలుగు కుటుంబాలు జీవిస్తున్నాయి. వారంతా నగరం నలుమూలల్లో దూరదూరంగా నివసిస్తూ ఉన్నారు.

చాలా అరుదుగా ఒకరినొకరు కలుసుకుంటూ ఉంటారు. ఎవరికీ బంధువర్గం అనేదే అందుబాటులో లేని దుర్భర దుస్థితి. అలాంటి ఒంటరి జీవితానికి అందరూ అలవాటుపడిపోయారు. ఆ రకం మనుగడ కారణంగా సౌమ్య తనకు తెలియకుండానే ఏ విషయాన్నీ పట్టించుకోలేని ఓ రకం నడవడికని అలవర్చుకుంది. దాంతో ఆమె ధోరణి ఎవరికీ అర్థం కాకుండా పోతోంది.

ఆనాటి పత్రికల్లో జానకమ్మగారి ఫోటో చూసిన కాలనీ ఆడవాళ్లంతా మరోసారి నవ్వుకోవడమే కాకుండా ఆమెతోపాటు తనని కూడా హేళన చేయడాన్ని భరించలేకపోయింది సౌమ్య.

"ఎలా భరిస్తున్నావమ్మా ఆ మెల్ల గుడ్డి ప్రపంచాన్ని?" అంటూ జాలిని కురిపిస్తూ సానుభూతిని ఒలకబోసినవారినేమీ అనలేకపోయింది.


అలాంటి పరిస్థితిలో అనుకోకుండా అనారోగ్యానికి గురయింది జానకమ్మ. హఠాత్తుగా ఆమెకు గుండెలో నొప్పి వచ్చింది. డాక్టర్లు ఆమెకి పూర్తి విశ్రాంతి కావాలన్నారు.

ఓవైపు తల్లికోసం తల్లడిల్లిపోతూ సమీర్ పరుగులు తీస్తుంటే మరోవైపు సౌమ్యలో అసంకల్పితంగా అత్తగారిపట్ల ఓ నిర్లక్ష్యభావం ఆవేశించింది. ఏం జరగాల్సి ఉందో అదే జరుగుతుందన్న ఓ అనూహ్య ధోరణితో జానకమ్మగారినంతగా పట్టించుకోలేదామె.



## అంత సీనుందా?

హ్యాపీడేస్ తరువాత చెప్పుకోదగ్గ విజయాలేవీ తమన్నా ఖాతాలో పడలేదు. కానీ తమన్నా ఇందుకు విరుద్ధంగా తానొక సూపర్ హీరోయిన్‌గా ఫీలవుతోంది. తన పారితోషికం సైతం అమాంతం పెంచేసింది. ఈమధ్య ఒక కంపెనీవారు తమ వ్యాపార ప్రచారం నిమిత్తం తమన్నాను సంప్రదించారుట. 'మా అమ్మాయికి కనీసం యాభై లక్షలకు తక్కువ కాకుండా పారితోషికం ఇవ్వాలనీ, ఈ ప్రకటన చాలాకాలం టీవీల్లో రావాలనీ'... అంటూ రకరకాల డిమాండ్లు చేసాడట తమన్నా తండ్రి. ఆయన డిమాండ్లు విన్న ఆ యాడ్ కంపెనీ ప్రతినిధులు 'తమన్నాకు అంత సీనుందా?' అని ఆశ్చర్యపోయి మారుమాట్లాడక మౌనంగా వెనుదిరిగారుట!




ఆ విషయాన్ని సమీర్ గ్రహించలేదు. సౌమ్యని ఎప్పుడూ ఆరకంగా అంచనా వేయలేదతను.

ఆ కారణంగా జానకమ్మగారికి అందాల్సిన శుశ్రూషతోబాటుగా మందుల వాడకం కూడా కుంటుపడిపోయింది. సకాలానికి ఏం మందులు వేసుకోవాలో తెలియకపోవడంతో ఆ ప్రమాదకరమైన జబ్బు ఎంతకీ తగ్గుముఖం పట్టడంలేదు.

కోడలు ధోరణిని తప్పుపట్టలేని స్వభావం కారణంగా తను మందులు సరిగ్గా వేసుకోవడంలేదనే విషయాన్ని కొడుకు చెవిన వేయలేదామె. అందువల్ల విషయం అర్థంకాక డాక్టర్ కూడా తలని బాదుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అదలా ఉండగా జానకమ్మగారి అస్వస్థత గురించి ఇండియాలో తెలిసిపోయింది.

దాంతో బోలెడు టెలిఫోన్ కాల్స్ ఇంటికి రాసాగాయి. ఇంట్లో ఒంటరిగా ఉండే ఆవిడే ఆ వచ్చే ఫోన్లన్నింటికీ ఏదో సమాధానం చెబుతూ కాలాన్ని జారవేయసాగింది.

మరోప్రక్క సమీర్‌కి ఈ-మెయిల్ తాకిడి ఎక్కువయింది. ఆఫీసులో తీరికలేక అతను సమాధానాలు ఇవ్వడంలేదు. అదే సమయంలో సౌమ్యకి వచ్చిన ఈ-మెయిల్స్ జవాబులకి నోచుకోలేదు.

★★★

రోజులు గడుస్తున్నాయి. రోజులు గడుస్తున్నాయని మామూలుగా అనేస్తే కథెలా ముందుకు సాగుతుంది? ఘటనలు, సంఘటనలు ఎన్నో దొర్లాల్సిందే. కథ కొత్త మలుపులు తిరిగితేనే కథనం కొనసాగుతుంది. అలాగే జరిగింది.

సౌమ్యంగా సాగుతున్న సౌమ్య జీవితంలో ఓ ఘోర దుర్ఘటన చోటు చేసుకుంది. అతి దారుణమైన విపత్తుకు లోనయిందామె.

ఎవరూ ఊహించని విధంగా ఓ రోజు మెట్రో వీధిని దాటుతుండగా త్రాగుబోతు చేతిలో అదుపుతప్పిన కారొకటి దూసుకొచ్చి ఆమెనో పది గజాల దూరం లాక్కెళ్లింది.

దాంతో తలకు బాగా గాయాలు కావడమే కాకుండా ఓ కన్ను కూడా చిట్లిపోయింది. మనం అడపాదడపా వినే తెలుగు సామెత 'చావుతప్పి కన్ను లొట్టబోయిందంటే ఇదే కావచ్చు!' ఆ ప్రమాదంలో స్పృహ తప్పి పడివున్న సౌమ్యని వెంటనే హాస్పిటల్‌కు తరలించారు పోలీసులు హుటాహుటిన

భార్యకు జరిగిన ప్రమాదం గురించి తెలియగానే సమీర్‌కి గుండె ఆగినంత పనయింది.

ఓవైపు తల్లి జబ్బుతో బాధపడుతూ ఉండగా ఈ ఘోరం జరగడంతో పూర్తిగా నీరసించిపోయాడతను.

హాస్పిటల్ నుంచి ఇంటికెళ్లగానే పాపని తీసుకుని సౌమ్య ఇంకా ఇంటికి చేరలేదంటూ ఆందోళనగా తల్లి ఎదురువచ్చింది.

జానకమ్మగారి ముందు సమీర్ తనని తాను అతికష్టంగా సంభాళించుకున్నాడు. చెప్పలేక చెప్పలేక మాటల్ని దిగమింగుతూ జరిగిన విషయం చెప్పాడు.

అది వింటూనే కుప్పకూలిపోయిందామె.

ఆ వెంటనే లేని శక్తిని కూడగట్టుకుని తనని కోడలి దగ్గరకు తీసుకెళ్లమంటూ పట్టుబట్టింది. ఆస్ట్రేలియా ఆసుపత్రుల్లో పిల్లలతో సందర్శకులను అనుమతించరు.

అందువల్ల ఆ రాత్రి జానకమ్మగారు వార్డులోనూ, సమీర్ పాపతోనూ ఇంట్లోనే వున్నారు.

★★★

మర్నాటి ఉదయం సమీర్ హాస్పిటల్‌కు వెళ్లగానే ఆశ్చర్యంతో కొయ్యబారిపోయాడు.

అదే వార్డులో సౌమ్య ప్రక్కనే తల్లి కూడా మరో మంచంమీద కనిపించింది అతనికి. సౌమ్యతోపాటుగా జానకమ్మగారి కళ్లకు కూడా గంతలు కట్టి ఉన్నాయి.

జరిగిందేమిటంటే గత రాత్రి డాక్టర్లు వార్డులో వున్న జానకమ్మగారిని అడిగి సమీర్‌కు ఫోన్ చేయబోయారు.

'ఐ బ్యాంక్ నుంచి కంటిని తీసుకు రాగలిగినా లేదా ఓ కన్నును దానం చేయడానికి ఎవరన్నా ముందుకు వచ్చినా కానీ సౌమ్య చిట్లిపోయిన కన్నును తీసివేయాలని వారి ఉద్దేశ్యం. ఆ డాక్టర్లలో ఓ తెలుగతను ఉండడం అదృష్టం. ఆస్ట్రేలియాలో కేవలం చనిపోయినవారి కళ్లనే ఇవ్వాలనే నియమం వున్నట్లు లేదు.

ఆ విషయం తెలిసి అతన్ని అడిగి ఓ కన్నుని సౌమ్యకి ఇవ్వడానికి వెంటనే సిద్ధపడిపోయి సంతకం పెట్టేసింది జానకమ్మ. పైగా తన మంచి కన్నునే ధారపోసిందామె.

ఇకముందు బ్రతికినంతకాలం ఆమె ఒంటి మెల్లకన్నుతో జీవితాన్ని వెళ్లదీయాల్సి వుంటుంది.

తల్లి చేసిన త్యాగాన్ని అక్కడున్న ప్రతివాళ్లూ ప్రశంసిస్తుంటే ఓ వైపు సంతోషం మరోవైపు దుఃఖంతో తల్లడిల్లిపోయాడు సమీర్.

తన బాధలో అత్తగారి విషయమే మరచిపోయింది సౌమ్య. జానకమ్మగారు పక్క మంచంలోనే ఉన్న విషయం ఆమెకు తెలియదు. సమీర్ కూడా కావాలనే తల్లి ప్రసక్తిని తీసుకురాలేదు. సౌమ్య తనంతట తానే అత్తగారు చేసిన త్యాగాన్ని తెలుసుకోవాలనే అతని ఉద్దేశ్యం.

★★★

చాలా పొద్దుపోయాక స్పృహలోకి వచ్చింది సౌమ్య.

చాలాసేపు తన దురదృష్టాన్ని తిట్టుకుంటూ స్పృహలోలేని తల్లి, ఏడుస్తున్న భార్యతో సాయంకాలందాకా వార్డులోనే గడిపాడు సమీర్.

హాస్పిటల్‌నుంచి ఇంటికి చేరగానే ఇండియాకి మెయిల్ వ్రాసి సౌమ్య తల్లిదండ్రుల్ని వెంటనే రావాల్సిందిగా కోరాడు సమీర్.

ఆ మెయిల్‌కి సమాధానం వెంటనే వచ్చింది. ఆ రాత్రి కూడా అతను పాపతో ఇంట్లోనే గడపాల్సి వచ్చింది.

మరునాడు తెల్లవారగానే సౌమ్య తండ్రి సమాధానం మెయిల్ కాపీని జేబులో పెట్టుకుని హాస్పిటల్‌కు బయలుదేరాడు.

ఆ ఉదయం కూడా జానకమ్మగారి కంటి దానం గురించి వివరంగా దినపత్రికలో ప్రచురింపబడింది. మళ్లీ ఈసారి కూడా ఆమె ఫోటోకి చోటు లభించింది. అయితే ఈసారి కళ్లకు గంతలు కట్టి ఉండగా తీసారామె చిత్రాన్ని.

హాస్పిటల్‌కు వెళ్లగానే అక్కడ ఉన్నవారంతా తన తల్లినెంతో అభినందిస్తూ ఉండడాన్ని గమనిస్తూనే వార్డులోకి వెళ్లాడు సమీర్.

అతన్ని చూస్తూనే బావురుమంది సౌమ్య. అలా ఏడుస్తూనే తన తలను బాదుకుంటూ జానకమ్మగారి మంచం వంక తన చేతిని చూపింది. ఆమె చేతిలో కూడా ఆ నాటి దినపత్రిక కాపీ ఉంది.

సమీర్ నోరు విప్పలేదు, భార్యను ఓదార్చనూలేదు. జేబులోంచి గత రాత్రి ఆమె తండ్రి నుంచి వచ్చిన మెయిల్ కాపీని సౌమ్య మంచంపైన వుంచి తల్లి వైపు నడిచాడు.

పైకి కొండంత విచారాన్ని వ్యక్తం చేస్తూనే 'తమకు మాత్రం ఆస్ట్రేలియా రావడం కుదరదు' అంటూ తండ్రి రాసిన ఆ మెయిల్‌ను చదవగానే ఎంతో అవమానభారంతో కృంగిపోయింది సౌమ్య.

★



## 67 గంటల్లో భూప్రదక్షణం

ఇటలీకి చెందిన కెప్టెన్ రికార్డో మోర్బరా, అతని కోపైలెట్ కొడుకు గ్రేబియల్‌తో కలసి ఇటీవల జినోవా ఎయిర్‌పోర్ట్ నుంచి తమ విమానంలో బయలుదేరి భూప్రదక్షణం చేసి 67 గంటల్లో తిరిగి బయల్దేరిన చోటికే చేరారుట. గతంలో వేగంగా భూప్రదక్షణం చేసిన స్టీవ్ ఫోసెట్ రికార్డును ఈ తండ్రీ కొడుకులు అధిగమించి కొత్త రికార్డును స్థాపించారు.

## అద్దమే డాక్టర్

భవిష్యత్తులో ఎవరూ హెల్త్ చెకప్‌కి డాక్టర్ దగ్గరకు శ్రమపడి వెళ్లనక్కర్లేదుట. ప్రొద్దున్న ముఖం కడుక్కుంటుండగా ముఖాన్ని ప్రతిబింబించే అద్దం ఆ ముఖాన్ని మానిటర్ చేస్తూ ఆ వ్యక్తి ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన బిపిలాంటి రీడింగులతో రిమోట్‌లో ఫ్యామిలీ డాక్టర్‌కి సందేశం పంపించేస్తుందిట. డాక్టర్ దాని ప్రకారం మందుల్ని ఆ వ్యక్తికి ఎస్సెమ్మెస్ చేసేస్తాడుట. మీరు ఆ ఎస్సెమ్మెస్‌ని మందుల షాపుకి డైవర్ట్ చేస్తే వాళ్లు మందులను ఇంటికే పంపించి వేస్తారు. వచ్చే 10 ఏళ్లల్లో ఇది ప్రపంచమంతటా జరగబోయే రియాల్టీ షో అంటున్నారు నిపుణులు.

-తటవర్తి

